కెరటం న్యూస్
( సామాన్యుడి ఆయుధం )
శనివారం 01, జులై 2023 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ



## 6589 మందికి 13,139.05 ఎకరాలకు

# పోడు పట్టాలు పంపిణీ

### లాంఛనంగా ప్రారంభించిన మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్

ఖమ్మం, జూన్ 30-కెరటం న్యూస్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పట్టాలు పంపిణి చేసిన రైతులకు ఇక నుండి రైతు బంధు, రైతు భీమా, ఉచిత విద్యుత్ పథకాన్ని వర్తించే విధంగా ముఖ్యమంత్రి కేసీఅర్ నిర్ణయం తీసుకున్నారని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆర్థిక శాఖల మంత్రి హరీష్ రావు ప్రకటించారు. శుక్రవారం స్థానిక భక్త రామదాసు కళాక్షేత్రంలో అర్హులైన 6589 మందికి గాను 13,139.05 ఎకరాలకు పోడు రైతులకు పట్టాలను మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ముందుగా గురువారం అకాల మరణం చెందిన రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ వేద సాయిచంద్ మృతి పట్ల మంత్రులు దిగ్భ్రాంతి వ్యక్తం చేసి, వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. ఖమ్మం, సత్తుపల్లి, వైరా, ఇల్లందు నియోజకవర్గాల పరిధిలోని 77 గ్రామ పంచాయతీలు, 9 మండలాల పరిధిలో ఉన్న 6589 మంది పోడు రైతులకు గాను 13,139.04 ఎకరాలకు సంబంధించి పాస్ పుస్తకాలను మంత్రులు హరీష్ రావు, పువ్వాడ అజయ్ కుమార్ లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీష్ రావు మాట్లాడుతూ.. మిగతా 2లో..






# 10/10 పక్కా..

### ఈసారి ఒంటికన్ను శివరాసన్‌ను ఇంటికి పంపిస్తాం..

- బీఆర్‌యస్ పతనం ఖమ్మం నుంచే ప్రారంభం: టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి
- జులై 2న తెలంగాణ జన గర్జన సభలో పాల్గొననున్న రాహుల్ గాంధీ
- రాహుల్ గాంధీ సభ ఏర్పాట్లను పరిశీలించిన రేవంత్ రెడ్డి
- సభకు ఆటకం కల్గిస్తే అడ్డుగోడలు కూల్చివేస్తాం.. అడ్డుకుంటే తొక్కిస్తాం
- జనగర్జనలో బీఆర్ఎస్ సభకన్నా 10 తలలు ఎక్కువనే ఉంటాయి
- ఖమ్మంకు రేణుక, భట్టి రెండు కళ్ళు, శీనన్న మూడవ కన్ను

3లో

## అధికార మదంతో విర్రవీగుతున్న

# బీఆర్ఎస్‌కు బుద్ధిచెపుతాం

- వాహనాలు ఇవ్వకుండా అడ్డుకుంటే కాంగ్రెస్ కార్యకర్తలు లక్షలాదిగా పాదయాత్రగా తరలివస్తారు..
- పాదయాత్రలో గుర్తించిన సమస్యలే కాంగ్రెస్ మ్యానిఫెస్టో
- ప్రతీ సంవత్సరం రెండు లక్షల ఉద్యోగాలకు క్యాలెండర్ ప్రకటిస్తాం
- పీపుల్స్ మార్చ్ సభలో భట్టి విక్రమార్క ఫైర్
- భట్టి పాదయాత్ర వల్లనే గిరిజనులకు పోడు పట్టాలు: వీహెచ్
- కేసీఆర్ వెన్నులో వణుకు మొదలైంది: గద్దర్

వనం నాగయ్య, కెరటం న్యూస్



అధికార మదమెక్కి ప్రజా సంపదను దోపిడీ చేస్తున్న బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికి నడుస్తున్న మార్చ్ ఈ పీపుల్స్ మార్చ్ పాదయాత్ర అనీ, దొరలు తెలంగాణ, సంపదను దోపిడీ చేయడానికి కాంగ్రెస్ తెలంగాణ ఇవ్వలేదని తెలంగాణలోని సబ్బండ వర్గాల ప్రజల జీవన ప్రమాణాలు బాగుండాలని తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు, లక్ష్యాలు నెరవేరాలని తల్లి సోనియమ్మ తెలంగాణ ఇచ్చిందని మిగతా 2లో..



## మెడికల్ కాలేజీ తరగతులకు

# ఏర్పాట్లు చేయాలి

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆర్థిక శాఖ మంత్రి హరీష్ రావు
- మంత్రి పువ్వాడతో కలిసి కాలేజీ నిర్మాణ పనులు పరిశీలన

3లో

## 6589 మందికి 13,139.05 ఎకరాలకు

# పోడు పట్టాలు పంపిణీ

(మొదటిపేజీ తరువాయి..)

ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న వారికి ప్రభుత్వం పోడు పట్టాలను అందజేసి, పోడు పట్టాలతో పాటు రైతు బంధు, రైతు భీమా, ఉచిత కరంట్, ప్రభుత్వ అన్ని ఫలాలకు హక్కుదార్లుగా చేసామన్నారు. శుక్రవారం రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 6 వేల ఎకరాల పోడు భూములకు పట్టాల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టో లో ఉన్నవి అమలుచేసినట్లు, మ్యానిఫెస్టో లో లేనివి పథకాలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. రాష్ట్రంలో 2471 గూడెంలు, తండాలను గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేశామన్నారు. ఖమ్మం లో క్రొత్త ప్రభుత్వ వైద్య కళాశాల ఏర్పాటు చేసినట్లు అన్నారు. గత 9 సంవత్సరాల్లో 18,519 కోట్లు గిరిజన సంక్షేమానికి ఖర్చు చేసినట్లు మంత్రి తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వసతుల కల్పన, అభివృద్ధితో గతంలో 30 శాతం ఉన్న ప్రసవాలు, ఇప్పుడు 70 శాతానికి చేరాయన్నారు. కళ్యాణలక్ష్మి, ఆసరా పెన్షన్లు, కేసీఆర్ కిట్, మిషన్ భగీరథ, ఇలా ఎన్నో పథకాలతో దేశానికి ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందని, తెలంగాణ ఆచరిస్తుంది.. దేశం అనుసరిస్తుంది అనే స్థాయికి చేరిందని అన్నారు. రూ. 72 వేల కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా రైతుబంధు పథకం తో జమ అయ్యాయన్నారు. రైతుబంధు నగదు బదిలీ, రైతుల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం అని అన్నారు. దక్షిణ భారతదేశ ధాన్యాగారంగా తెలంగాణ రూపుదిద్దుకొందని, ఇది ప్రభుత్వంచే పుష్కలమైన సాగునీరు, కోతల్లేని కరంట్, పంట పెట్టుబడిగా రైతుబంధు, అన్ని వసతులకల్పన తో సాధ్యమైందన్నారు. ఖమ్మం జిల్లా అద్భుత ప్రగతి సాధించిందని, ఆదివాసీ కొత్తగూడెం నూతన జిల్లాగా ఏర్పడడంతో అభివృద్ధిపథంలో ఉందని ఆయన తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో 500 పడకల ఆసుపత్రులు, సత్తుపల్లి, మధిర, వైరా, ఇల్లందుల్లో 100 పడకల ఆసుపత్రులు, 22 మహిళా రెసిడెన్షియల్ స్కూళ్లు, 95 క్రొత్త గురుకులాలు, 1002 గురుకుల పాఠశాలల్లో 6 లక్షల మంది విద్యార్థులు విద్యానభ్యసించుచున్నట్లు మంత్రి అన్నారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్లతో 500 మందికి ప్రతి సంవత్సరం డాక్టర్లుగా ప్రవేశం లభిస్తున్నట్లు ఆయన తెలిపారు. రూ. 250 కోట్ల రూపాయలతో 3 ఫెజ్ లైన్ల తో గిరిజనుల పంటపొలాలకు విద్యుత్ అందుతుందని ఆయన అన్నారు. స్వంతంగా ఉపాధికి ప్రభుత్వం ఊతం ఇస్తుందని, విదేశాల్లో చదువుకు అంబేద్కర్ ఓవర్సెస్ పథకం ద్వారా రూ. 20 లక్షల చేయూత, సేవాలాల్, కొమురం భీం జయంతులు అధికారికంగా నిర్వహిస్తున్నట్లు, ఆదివాసీలకు రూ. 50 కోట్లతో బంజారాల ఆత్మగౌరవ భవనం, కొమురం భీం భవనం బంజారాహిల్స్ లో నిర్మించినట్లు మంత్రి అన్నారు. పోడు పట్టాల వచ్చాక, అటవీ శాఖ అధికారులు, పోలీసులు కన్నెత్తి చూడరని, పోడు భూములకు మీరే ఓనర్లు, హక్కుదార్లని, అడవి బిడ్డలను అన్నదాతలుగా మార్చిన ఘనత కేసీఆర్ దేనని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ మాట్లాడుతూ, జిల్లాలో 6589 మంది పోడు రైతులకు 13,139.04 ఎకరాలకు సంబంధించి పోడుభూములకు పట్టాల పంపిణీ చేసినట్లు తెలిపారు. 2005 లో రూపొందించిన ఆర్ఓఎఫ్ఆర్ చట్టం మేరకు పోడు భూముల్లో సాగుచేస్తున్న వారికి హాక్కుదార్లుగా పట్టాలు ఆందజేసినట్లు తెలిపారు. పట్టాలు పొందిన వారికి రైతుబంధు, రైతుభీమా తదితర అన్ని ప్రభుత్వ ఫలాలు అందుతాయని అన్నారు. సీతారామ ప్రాజెక్ట్ ద్వారా సాగునీరు అందుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, స్పెషల్ సీఎస్ రామకృష్ణ రావు, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, వైరా, ఇల్లందు ఎమ్మెల్యేలు రాములు నాయక్, హరిప్రియ నాయక్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, నగర మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, భద్రాచలం ఐటిడిఏ పీవో గౌతమ్ పోట్రూ, ఖమ్మం మున్సిపల్ కమిషనర్ ఆదర్శ్ సురభి, జిల్లా అటవీ అధికారి సిద్దార్థ్ విక్రమ్ సింగ్, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వర రావు, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అధికార మదంతో విర్రవీగుతున్న

# బీఆర్ఎస్‌కు బుద్ధిచెప్తుతాం..



(మొదటిపేజీ తరువాయి..)

సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ధ్వజమెత్తారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఖమ్మం జిల్లా లో ప్రజా స్పందనతో జోరుగా నడుస్తోంది. ఈ సందర్భంగా జరిగిన సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ... పాదయాత్ర చేసిన గ్రామాల్లో ఆ ప్రజలకు మాట ఇచ్చి వచ్చాను వారి సమస్యలు తప్పనిసరిగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చాను. ఆదివాసి బిడ్డలకు తిరిగి పోడు భూములపై హక్కులు కల్పిస్తామని, కొలువులు రాక గడ్డాలు పెంచుకొని రోడ్ల మీద తిరుగుతున్న యువతను చూసి గుండెలు పగిలి రోధిస్తున్న తల్లిదండ్రులకు వారి ఆకాంక్షలు నెరవేర్చుతానని, బీటెక్, ఎంబీఏ పూర్తి చేసి కొలువులు లేక పెళ్లిళ్లలో క్యాటరింగ్ చేస్తున్న నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు ఇస్తామని మాట ఇచ్చి వచ్చానని అన్నారు. మార్చి 16న ఆదిలాబాద్ జిల్లా పిప్పిరి గ్రామంలో ప్రారంభమైన పాదయాత్ర 17 జిల్లాలు, 36 నియోజకవర్గాలు, 750 గ్రామాలు చుట్టేసి ఖమ్మంలో జులై 02న జన గర్జన బహిరంగ సభ నాటికి 109 రోజుల్లో 1360 కిలోమీటర్ల పాదయాత్ర పూర్తి అవుతుందని అన్నారు. రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి ప్రతి సంవత్సరం రిక్రూట్మెంట్ క్యాలెండర్‌ను ప్రకటన చేస్తామని హామీ ఇచ్చారు. పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సందర్భంగా ఖమ్మం లో జూలై 02న నిర్వహించే రాహుల్ గాంధీ జనగర్జన సభకు ప్రభుత్వం ఎన్ని ఆటంకాలు సృష్టించిన, కాంగ్రెస్ కార్యకర్తలు కదం తొక్కుతూ కదిలి రావడం ఖాయం. లక్షల మందితో సభ విజయవంతం అవుతుందన్నారు. అధికారాన్ని ప్రయోగించి బెదిరింపులకు పాల్పడి వాహనాలు రాకుండా అడ్డుకుంటారేమో కానీ మా కాంగ్రెస్ కార్యకర్తలకు కాళ్లు ఉన్నాయి పాదయాత్రగా వచ్చే లక్షల మంది కార్యకర్తలను అడ్డుకోవడం ఈ ప్రభుత్వంతో కాదు.

**పాదయాత్రలో గుర్తించిన సమస్యలే కాంగ్రెస్ మ్యానిఫెస్టో:** పాదయాత్రలో వచ్చిన సమస్యలను ఎజెండాగా చేసుకొని కాంగ్రెస్ మేనిఫెస్టోలో పొందుపరిచి అధికారంలోకి రాగానే వాటిని ఎలా పరిష్కారం చేస్తామో ఖమ్మం సభ వేదిక ద్వారా ప్రజలకు వివరిస్తామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. జులై 02న ఖమ్మంలో నిర్వహించే భారీ బహిరంగ సభ తెలంగాణకు దశ దిశ నిర్దేశం చేసే విధంగా తమ సందేశం ఉంటుందన్నారు. ఏఐసీసీ దిశ నిర్దేశాల్లో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు నిర్విరామంగా సాగడం వెనక ఏఐసీసీ, పీసీసీ, డిసిసి, మండల, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కృషి దాగి ఉందన్నారు. మార్చి 16న ప్రారంభమైన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఎండకు ఎన్నాము, వానకు తడిసి ఎన్ని కష్టాలు ఎదురైనా తెలంగాణ ప్రజల ఆశలు ఆకాంక్షలు నెరవేర్చాలని అకుంటిత దీక్షతో చేసిన పాదయాత్రకు ప్రజల ఆశీర్వాదమే నన్ను నడిపించిందన్నారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా ఎప్పటికీ గుర్తుండిపోయే విధంగా పాలేరు నియోజకవర్గం పొన్నెకల్లులో పైలాను నిర్మించిన పిసిసి సభ్యులు రాయల్ నాగేశ్వరరావు, తలదాత పుచ్చకాయల రామనాథంకి ప్రత్యేకంగా నా ధన్యవాదాలు అని అన్నారు.

**భట్టి పాదయాత్ర వల్లనే గిరిజనులకు పోడు పట్టాలు: వీహెచ్**

పిసిసి మాజీ అధ్యక్షులు విహెచ్ హనుమంతరావు మాట్లాడుతూ... సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర ముగింపు సందర్భంగా జులై 02న ఖమ్మంలో నిర్వహించే రాహుల్ బహిరంగ సభకు బిఆర్ఎస్ ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించిన కాంగ్రెస్ సభ విజయవంతం అవుతుందన్నారు. ఆరోగ్యం క్షీణీంచిన, మండుతున్న ఎండలను సైతం లెక్కచేయకుండా 109 రోజుల్లో 1360 కిలోమీటర్లు పాదయాత్ర చేసిన భట్టి విక్రమార్కకు అభినందనలని అన్నారు. బట్టి విక్రమార్క చేపట్టిన పాదయాత్ర ఫలితంగానే రాష్ట్ర ప్రభుత్వంలో కదలిక వచ్చి నేడు అడవి బిడ్డలకు పోడు పట్టాలు పంపిణీ మొదలుపెట్టారని అన్నారు. ఇంటికో కొలువు, మూడెకరాల భూమి ఇస్తానని ప్రజలను దగా చేసిన బిఆర్ఎస్ ప్రభుత్వానికి గుణపాఠం చెపుదామన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో రెండు లక్షల కమిషన్ కొడుతున్న బిఆర్ఎస్ నేతలకు ప్రజలు కర్రుకాల్చి వాత పెట్టాలని అన్నారు. దళిత బంధు పేరుతో దళితుల దగా చేసిన కేసీఆర్ 30శాతం కమిషన్ దండుకున్న టిఆర్ఎస్ ఎమ్మెల్యేలు దళితుల సొమ్ము కూడా తిన్నారని అన్నారు. సీఎం కేసీఆర్ బీసీలకు లక్ష రూపాయల ఇస్తాననే స్కీము కేవలం ఎన్నికల పథకమేనని అన్నారు. తెలంగాణ ఇస్తే కాళ్లు కడిగి నెత్తిన పోసుకుంటాను అని సోనీయమ్మ దగ్గర మోకరిల్లిన కేసీఆర్ 10 ఏళ్లు అధికారం అనుభవించాక అహంకారం పెరిగి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ ను బంగాళాఖాతంలో పడేస్తానన్నాడు దొర పోకడకు నిదర్శనమని అన్నారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు 4000 కిలోమీటర్లు పాదయాత్ర చేసి రాహుల్ దేశ చరిత్రలో నిలిచారని గుర్తుచేశారు. బీసీ జన గణన ఎందుకు చేయరు? అడవిలో ఉండే పులుల లెక్కలు ప్రభుత్వం దగ్గర ఉంటాయి కానీ, బీసీల లెక్కలు ఉండవా? దేశంలో రాష్ట్రంలో రానున్నది ఇందిరమ్మ రాజ్యమే. ప్రధాని మోడీ అవుట్ రాహుల్ గాంధీ ఇన్ అవుతారని కాంగ్రెస్ నేత వీహెచ్ అన్నారు.

**కేసీఆర్ వెన్నులో వణుకు మొదలైంది: గద్దర్**

ప్రజాయుద్ధ నౌక గద్దర్ మాట్లాడుతూ.. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్రతో కేసీఆర్ వెన్నులో వణుకు మొదలైందని అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు పేదలకు పంపిణీ చేసిన 24 లక్షల ఎకరాల భూమిని కేసీఆర్ భూ బకాసురుడిగా మింగాడని అన్నారు. ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు భట్టి పాదయాత్రలో మాభూమి మాకు కావాలని నినందించిన ప్రజలే ఎక్కువగా కనిపించారని గుర్తుచేశారు. పోడు భూములకు పట్టాలు ఇప్పించాలని ఆదివాసి బిడ్డలు పాదయాత్రకు ఏదురొచ్చి స్వాగతం పలికి వేడుకున్నారుని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు పాదయాత్రలో వెలుగు చూసాయని అన్నారు. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గం పొన్నెకల్లు గ్రామానికి చేరుకున్న సందర్భంగా పీపుల్స్ మార్చ్ పైలాన్ ను మాజీ పీసీసీ అధ్యక్షులు విహెచ్ హనుమంతరావు, ప్రజా పార్టీ అధ్యక్షులు గద్దర్, కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి, డిసిసి అధ్యక్షులు దుర్గాప్రసాద్, పిసిసి సభ్యులు రాయల నాగేశ్వరరావు, మహమ్మద్ జావిద్, మాజీ ఎమ్మెల్సీ పొట్ల నాగేశ్వరరావు, ఎస్టీ సెల్ అధ్యక్షులు బెల్లయ్య నాయక్, ఓయూజేఏసీ విద్యార్థి సంఘం చైర్మన్ లోకేష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కాలేజీ తరగతులకు అన్ని ఏర్పాట్లు చేయాలి





**ఖమ్మం, జూన్ 30-కెరటం న్యూస్**

ఖమ్మం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుండి 100 సీట్లతో నిర్వహించనున్న కళాశాల తరగతులకు అన్ని ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆర్థిక శాఖల మంత్రి హరీష్ రావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచలో పోడు భూమల పట్టాలను పంపిణీ అనంతరం హెలికాప్టర్ ద్వారా ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియం కు రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, ఆర్థిక శాఖల మంత్రితో, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు ఖమ్మం చేరుకున్నారు. అనంతరం నేరుగా పాత కలెక్టరేట్ భవనంలో ఏర్పాటు చేయనున్న ప్రభుత్వ మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో మంత్రులు కొనసాగుతున్న ఆధునీకరణ పనులను పరిశీలించారు. మెడికల్ కళాశాలలో కొనసాగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనుకున్న సమయానికి పనులన్నీ పూర్తి చేసి సకాలంలో తరగతులు నిర్వహించేందుకు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్, అధికారులను ఆదేశించారు. పాత కలెక్టరేట్ భవనం 5 ఎకరాలు, రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం 3ఎకరాలు మొత్తం 8 ఎకరాల సువిశాల ప్రాంగణంలో కళాశాలను ఏర్పాటు చేశామని, ఈ విద్యా సంవత్సరం తరగతులు నిర్వహించేలా తగు చర్యలు చేపట్టామని మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ వివరించారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో 2023-24 విద్యా సంవత్సరం నుంచి నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం ప్రకారం అనుమతి లభించిన దరిమిలా తరగతుల నిర్వహణకు అంతా సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కేటాయించిన ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లతో మంత్రులు గ్రూప్ ఫోటో దిగారు. ఈ సందర్భంగా మంత్రుల వెంట ఎంపీలు నామా నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, ఆర్థిక శాఖ స్పెషల్ సీఎస్ రామకృష్ణ రావు, జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, పోలీస్ కమీషనర్ విష్ణు ఎస్. వారియర్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, వైరా ఎమ్మెల్యే రాములు నాయక్, మేయర్ పునుకొల్లు నీరజ, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, ఐటిడిఎ భద్రాచలం పీవో గౌతమ్ పోట్రూ, ఖమ్మం మునిసిపల్ కమీషనర్ ఆదర్శ్ సురభి, కార్పొరేటర్ కర్నాటి కృష్ణ, ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డా. రాజేశ్వరరావు, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, ప్రజా ప్రతినిధులు, వైద్యాధికారులు తదితరులు ఉన్నారు.

# 10/10 పక్కా..

**ప్రత్యేక ప్రతినిధి, కెరటం న్యూస్**

తెలంగాణాలో చంద్రశేఖర్ రావు పాలనకు రోజులు దగ్గర పడ్డాయి. ఖమ్మం నుంచే బీఆర్ యస్ పతనం ప్రారంభం అవుతుంది. సభకు ఆటంకాలు కల్పిస్తున్నట్లు తెలుస్తుంది. అడ్డుకుంటే గోడలనైనా కూల్చి వేస్తాం ఆటంకాలు కల్పిస్తే తొక్కేస్తాం అని హెచ్చరించారు. కొందరు యువకులు అంటున్నారు. వారు వాహనాలు ఇవ్వకపోయినా మాకు కాళ్ళు ఉన్నాయని అంటున్నారు. భట్టి విక్రమార్క 1300 కి .మీ యాత్ర చేసి స్ఫూర్తి నింపారు. మనం ఈ కొద్దీ దూరం నడవలేమా అని అన్నారు. వాళ్ళ ఆటంకాలను ప్రజలు గమనిస్తున్నారని వడ్డీతో సహా తీర్చుకుంటారని అన్నారు. గతంలోనే ఖమ్మం ప్రజలు 10 సీట్లకు ఒక్క సీటే బీఆర్ యస్ కు ఇచ్చారు . ఇప్పుడు ఉన్న ఒంటికన్ను శివరాసన్ కూడా గెలవడు..ఇంటికి పోవడం ఖాయం అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి బీఆర్ యస్ పాలనపై కేసీఆర్ విధానాలపై తీవ్ర స్థాయిలో నిప్పులు చెరిగారు .జులై 2 ఖమ్మం లో జరగనున్న రాహుల్ గాంధీ పాల్గొననున్న జనగర్జన సభ ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం సభా స్థలి వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ సభకు అధికార పార్టీ ఆటంకాలు కల్పించడం పై విమర్శలు గుప్పించారు . 15 వందల ఆర్టీసీ బస్సు లకోసం 2 కోట్ల రూపాయలు చెల్లించి తీసుకుంటామంటే ముందు సరే అన్న అధికారులు తర్వాత ప్రభుత్వ పెద్దల ఆదేశాలమేరకు ప్రధానంగా శాఖ మంత్రిగా ఉన్న పువ్వాడ అజయ్ ఇవ్వొద్దన్నాడని అధికారులు చెపుతున్నారని ధ్వజమెత్తారు . ఇదేనా ఆర్టీసీ కి లాభం చేసే పద్దతి మేము ఉచితంగా బస్సు లు తీసుకోవడంలేదు నష్టాల్లో ఉన్న సంస్థను ఆదుకుందామని ,సిబ్బందికి మేలు చేద్దామని అనుకుంటే వారు నిరాకరించడం విడ్డురంగా ఉందన్నారు .

**జిల్లాకు పొంగులేటి మూడో కన్ను..:**

ఖమ్మం జిల్లా కాంగ్రెస్ లో ఒక కన్ను రేణుక చౌదరి అయితే మరో కన్ను సీఎల్పీ నేత భట్టి అని మూడు కన్ను పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని రేవంత్ రెడ్డి అన్నారు . మూడవ కన్ను పవర్ ఎలా ఉంటుందో తెలుసుగా అని చమత్కరించారు. జిల్లాలో ఎలాంటి విభేదాలు లేకుండా అందరు ఒక్కటై పని చేయాలనీ అందుకు ఏఐసీసీ కూడా పరిశీలకులను పంపుతుందని అన్నారు . సభ నిర్వహణ కోసం పొంగులేటి తోడుగా ఇక్కడ రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు కాకుండా ఏఐసీసీ బృందం ఒకటి ఉంటుందని పేర్కొన్నారు. రేవంత్ వెంట ఏఐసీసీ పరిశీలకులు రోహిత్ చౌదరి, రాష్ట్ర నాయకులు మధు యాష్కీ, వి.హనుమంతరావు, సీతక్క, బలరాం నాయక్, పొదెం వీరయ్య, మహేష్ కుమార్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## బోనకల్ మండలం యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో

# భారీ బైక్ ర్యాలీ



- **ముఖ్య అతిథిగా పాల్గొన్న మల్లు సూర్య విక్రమాదిత్య**
- **ర్యాలీలో భాగంగా వైఎస్సార్, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు**
- **గ్రామగ్రామాన యువత బాణాసంచా కాల్చి ఆనందోత్సాహాలతో కాంగ్రెస్ నినాదాలతో జై కొట్టారు**

**కెరటం న్యూస్, బోనకల్ ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ శాసనసభాపక్ష నేత, మధిర శాసనసభ్యులు భట్టి విక్రమార్క మల్లు చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ముగింపు సభ జూలై 2 ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఖమ్మంలో జరుగు తెలంగాణ జన గర్జన సభ ను జయప్రదం చేయాలని బొనకల్ మండలంలో బొనకల్ క్రాస్ రోడ్ నుండి రావినూతల బొనకల్ సెంటర్, గ్రామాల మీదుగా ముష్టికుంట్ల గ్రామం వరకు యూత్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ చేశారు ఈ బైక్ ర్యాలీకి ముఖ్య అతిథిగా సిఎల్పీ నేత భట్టి విక్రమార్క మల్లు గారి కుమారుడు మల్లు సూర్య విక్రమాదిత్య గారు పాల్గొని కార్యకర్తలను ఉత్సాహపరిచారు... అనంతరం ముష్టికుంట్ల గ్రామంలో జరిగిన సభలో సూర్య విక్రమాదిత్య గారు మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా బొథ్ నియోజకవర్గం పిప్పరి గ్రామం నుండి భట్టివిక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ప్రజా పోరాటం అని ఎండనకా,వాననక తన ఆరోగ్యం సైతం లెక్కచేయకుండా వడదెబ్బ తగిలిన తన యాత్రను తెలంగాణ ప్రజల కోసం ఆపకుండా ఖమ్మం లో పాదయాత్ర పూర్తి చేసుకుంటున్న సందర్భంగా జరిగే పాదయాత్ర ముగింపు బహిరంగ సభలో రాహుల్ గాంధీ గారు ముఖ్య అతిథిగా పాల్గొంటారు అలాగే ఈ కార్యక్రమంలో పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరుతారని తెలిపారు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు పైడిపల్లి కిషోర్ కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గాలి దుర్గారావు, మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి రామకోటేశ్వరావు డిసిసి కార్యదర్శి బంధం నాగేశ్వరరావు, కో ఆప్షన్ సభ్యులు షేక్ జమాలుద్దీన్, మధిర నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు తూమాటి నవీన్ రెడ్డి,ఉపాధ్యక్షుడు రమేష్, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు భద్రు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారపల్లి ప్రేమ్ కుమార్, బిసి సెల్ అధ్యక్షులు కందుల పాపారావు, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఆయా గ్రామాల అధ్యక్షులు, అనుబంధ సంఘాల అధ్యక్షులు మరియు కార్యకర్తలు అభిమానులు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వనం నాగయ్య, కెరటం న్యూస్

**మహిళల్లో** మూత్ర సంబంధమైన సమస్యలు చాలా ఎక్కువ. పురుషులతో పోలిస్తే మూత్ర సంబంధమైన ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశమూ ఎక్కువే. మహిళల దేహనిర్మాణ పరమైన (అనటామికల్) ప్రత్యేకతలే ఇందుకు కారణమని ప్రముఖ మూత్ర అవయవ శస్త్ర చికిత్స వైద్య నిపుణులు, శ్రీరాం కిడ్నీ సెంటర్ అధినేత డాక్టర్ కె.గురునాథరావు తెలిపారు. "యురినరీ సమస్యలకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని డా.గురు నాథ రావు తెలిపారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న కిడ్నీ సంబంధిత వ్యాధుల పట్ల.. మూత్ర సమస్యలపై ఆయన కెరటం న్యూస్ తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆయన తెలిపిన వివరాలు ఆయన మాటల్లోనే..



# మహిళల్లో యూరినరీ ఇన్ఫెక్షన్లకు శాశ్వత పరిష్కారం

# శ్రీరాం కిడ్నీ సెంటర్

## అన్ని రకాల యూరినరీ సమస్యలకు చక్కని పరిష్కారం

## డా.కే.గురునాథరావుతో కెరటం న్యూస్ స్పెషల్ ఇంటర్వ్యూ..



### మహిళల్లో యూరినరీ సమస్యలు:

ప్రముఖంగా చెప్పాలంటే మహిళల్లో మూత్రనాళం చిన్నగా ఉంటుంది. అంతేకాదు.. అది వారి జననేంద్రియాలకు దగ్గరగా ఉండటం వల్ల ఈ తరహా ఇన్ఫెక్షన్లు ఎక్కువ అని డా. గురునాథ రావు అన్నారు. మహిళల్లో వచ్చే మూత్రసంబంధ సమస్యల్లో.. యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్, యూరినరీ ఇన్ కాంటినెన్స్ (చిన్నచిన్న కారణాలతో.. అంటే దగ్గినప్పుడు, నవ్వినప్పుడు తమ ప్రమేయం లేకుండానే మూత్రం కారిపోతూ ఉండటం), మూత్ర విసర్జన సమయంలో మంట, తరచూ మూత్రవిసర్జనకు వెళ్లాల్సిరావడం వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయని అన్నారు. ఇన్ఫెక్షన్ మరీ ఎక్కువైతే మూత్రంలో రక్తం కూడా కనిపిస్తుంది. ఇది కేవలం ఇన్ఫెక్షన్తో వచ్చే లక్షణమే అయినప్పటికీ, ఎక్కువ భయాందోళనకు గురిచేస్తుందన్నారు.

## మహిళల్లో ఎక్కువగా కనిపించే యూరినరీ ట్రాక్ట్ ఇన్ఫెక్షన్లు ఇవీ..

కొత్తగా పెళ్లయిన మహిళల్లో హనీమూన్ సిస్టయిటిస్ అనే సమస్యతో మాటిమాటికీ మూత్ర విసర్జనకు వెళ్లాల్సి రావడం, మూత్రంలో ఇన్ఫెక్షన్లు సాధారణం అన్నారు. మధ్యవయసు మహిళల్లో (పోస్ట్ మెనోపాజల్ ఉమన్) కూడా మూత్రంలో ఇన్ఫెక్షన్లు సాధారణంగా కనిపిస్తాయి. నెలసరి ఆగిపోయాక వచ్చే హార్మోన్ల లోపమే ఇందుకు కారణం. ఈస్ట్రోజెన్ హార్మోన్ లోపం వల్ల మూత్రనాళంలోని లోపలి పొర సన్నబడే అవకాశం ఉంటుందన్నారు. ఫలితంగా బ్యాక్టీరియా పేరుకుపోయి... ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశాలు పెరుగుతాయని అన్నారు.

## ఇన్ఫెక్షన్లలో కొన్ని..:

మూత్రంలో ఇన్ఫెక్షన్లు రకరకాలుగా రావచ్చు. మూత్రనాళంలో వచ్చే ఇన్ఫెక్షన్లను 'యురెథ్రైటిస్' అంటారు. మూత్రాశయంలోని ఇన్ ఫెక్షన్లను 'సిస్టయిటిస్' అంటారు. మూత్రపిండాల్లో వచ్చే ఇన్ఫెక్షన్లను 'పైలోనెఫ్రైటిస్' అంటారు. మొదటిసారి మూత్రంలో ఇన్ఫెక్షన్ రావడాన్ని 'ప్రైమరీ ఇన్ఫెక్షన్' అనీ, మళ్లీమళ్లీ రావడాన్ని 'పర్సిస్టెంట్ బ్యాక్టీరియోరియా' లేదా 'రికరెంట్ యూరినరీ ఇన్ఫెక్షన్' అని అంటారు. మొదటిసారి వచ్చే ఇన్ఫెక్షన్ల కోసం ప్రత్యేకమైన పరీక్షలేమీ అవసరం లేదు. కానీ మళ్లీ మళ్లీ వస్తుంటే మాత్రం.. కారణం ఏమిటో తెలుసుకోవాలి. మూత్రవిసర్జక వ్యవస్థలో పుట్టుకతో వచ్చే లోపాల కారణంగా తరచూ ఇన్ఫెక్షన్లు వస్తుంటే.. శస్త్రచికిత్స ద్వారా సరిచేయవచ్చు. ఒక్కోసారి. మూత్రావయవాలలో టీబీ వల్ల కూడా ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఉంది. ఇలాంటప్పుడు టీబీ చికిత్స తీసుకోవాలని డా.గురునాథ రావు తెలిపారు.

## నిర్ధారణ పరీక్షలు:

మూత్రంలో మాటిమాటికీ ఇన్ఫెక్షన్ వచ్చేవారికి సాధారణ పరీక్షలతోపాటు అల్ట్రాసౌండ్ స్కానింగ్, కొన్ని ప్రత్యేకమైన ఎక్స్-రే (ఐవీయూ, ఎంసీయూజీ లాంటివి) చేయాల్సి ఉంటుంది. మూత్రవిసర్జక వ్యవస్థలో టీబీ ఉంటే దాని నిర్ధారణకు ప్రత్యేకమైన మూత్రపరీక్షలు చేయాల్సి ఉంటుందన్నారు.

## గర్భిణుల్లో యూరినరీ సమస్యలు..:

గర్భిణుల్లోనూ మూత్రంలో ఇన్ఫెక్షన్లు వచ్చే అవకాశం ఎక్కువ. గర్భధారణ సమయంలో గర్భసంచి పెరుగుతున్నకొద్దీ.. అది మూత్రనాళాలపై ఒత్తిడి కలగజేస్తుంది. ఫలితంగా మూత్రపిండాలు వాచిపోతాయి. దాంతో మూత్రాశయంలో ఉండే ఇన్ఫెక్షన్.. మూత్రపిండాలకూ చేరే అవకాశం ఉంటుంది. ఈ సమయంలో మూత్రంలో ఇన్ఫెక్షన్ రావడం వల్ల అబార్షన్ అయ్యే ప్రమాదమూ ఉంటుంది. కొందరిలో నెలలు నిండకముందే ప్రసవం కూడా కావచ్చు. అందువల్ల గర్భిణులు మూత్రపరీక్ష చేయించుకుని, ఇన్ఫెక్షన్ ఉంటే మందులు తప్పకుండా వాడాల్సి ఉంటుంది.

## ఇన్ఫెక్షన్‌కు చికిత్స:

సాధారణంగా వచ్చే ఇన్ఫెక్షన్లు మూడు రోజులపాటు యాంటీబయాటిక్స్ కోర్సు సరిపోతుంది. మూత్ర పిండాలలో ఇన్ ఫెక్షన్ వచ్చినట్లయితే పది నుంచి పదిహేను రోజుల వరకు యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. కొందరిలో తరచూ ఇన్ఫెక్షన్లు వస్తున్నట్లయితే.. దీర్ఘకాలంపాటు చికిత్స అవసరమవుతుంది. ఇందులో చాలా తక్కువ మోతాదులో దీర్ఘకాలంపాటు యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. ఇక కొందరిలో మూత్రపిండాలలో రాళ్లను తొలగించడం కోసం కొన్ని నాన్సర్జికల్, సర్జికల్ ప్రొసీజర్స్ అవసరం కావచ్చని డా.గురునాథ రావు వెల్లడించారు.


వనం నాగయ్య, కెరటం న్యూస్

**మందులు, సూదులు** మాత్రమే కాదు మంచి మాటలు కూడా ఆరోగ్యాన్ని అందిస్తాయంటారు ఆర్టీసీ వైద్యులు డాక్టర్ గిరిసింహారావు. ఆర్టీసీ ఖమ్మం రీజియన్ లోని ఉద్యోగులకు కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు వైద్యునిగా సీనియర్ వైద్యాధికారిగా డాక్టర్ గిరిసింహారావు విధులు నిర్వర్తిస్తున్నారు. మరోవైపు ప్రవృత్తిగా తన కలం నుంచి జాలువారిన రచనలతో సామాజిక రుగ్మతలు నయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. దాంతోపాటు 'ప్రజాహిత' కార్యక్రమాల్లో ముందుంటున్నారు. ఒకవైపు వృత్తిలో ఉత్తమ సేవలు అందిస్తూనే మరోవైపు ప్రవృత్తిలో ప్రశంసలు అందు కుంటున్నారు. ఖమ్మం ఆర్టీసీ వైద్యాధికారి డా.ఎ.వి.గిరిసింహారావు..



# సమాజ హితమే అభిమతం..

## సేవలతో గుర్తింపు-జనచైతన్య కవితలతో తరింపు
## ఆర్టీసీ వైద్యులు డాక్టర్ గిరి సింహారావు



1993లో ఖమ్మం రీజియన్ కు మెడికల్ అధికారిగా ఆర్టీసీలో డాక్టర్ ఏవీ గిరిసింహారావు ఉద్యోగంలో చేరారు. తరువాత కొంతకాలం కరీంనగర్ లో వైద్యాధికారిగా పనిచేశారు. తిరిగి ఆయన ఖమ్మంలో వైద్యాధికారిగా బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. రెండున్నర దశాబ్దాలుగా ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబాలకు వైద్య సేవలను అందిస్తున్నారు.

### ప్రజాహిత కార్యక్రమాలు..

ఒక వైపు తన విధులను నిర్వర్తిస్తూనే మరోవైపు సమాజహిత కార్యక్రమాలను నిర్వర్తిస్తున్నారు. ఇప్పటి వరకు ఆయన సుమారు ఆరు వందల వైద్య శిబిరాలను నిర్వహించారు. అందులో ముఖ్యంగా ప్రపంచ మధుమేహ దినం, ప్రపంచ హృదయ దినం, డెంగీ జ్వరం, స్వైన్ ఫ్లూ నివారణ శిబిరాలను పదుల సంఖ్యల్లో ఏర్పాటు చేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి రక్తం అందించాలనే ఉద్దేశంతో తనతోపాటు తనకు తెలిసిన వారితో సుమారు రెండు వందల వరకు రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేశారు. వందలాది మందితో రక్తదానం చేయించారు. వీటితో పాటు నిత్యం ఆర్టీసీ కార్మికు లకు ఆరోగ్యంపై సూచనలు చేస్తూ, ఆరోగ్య అవగాహన శిబిరాలు నిర్వహిస్తూ వారి ఆరోగ్యాన్ని కాపాడటంలో  కృషి చేస్తున్నారు. ధూమపానం, మద్యపానం వంటి చెడు వ్యసనాల బారిన పడిన వారిని వాటికి దూరంగా ఉండేందుకు ప్రత్యేకంగా కౌన్సెలింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

### ప్రశంసలు.. అభినందనలు..

విధినిర్వహణలో ఉద్యోగులకు,ప్రజలకు ఉత్తమ సేవలం దించిన గిరిసింహారావుకు ఆర్టీసీ ఎండీ నుంచి అభినందనలు, ప్రశంసలు అందుకున్నారు. ఆర్టీసీ కార్మికులకు అందిస్తున్న

అసాధారణ సేవ లను ప్రభుత్వం గుర్తించి ఉత్తమ వైద్యాధికారిగా ప్రశంసాపత్రాన్ని అందించింది. ఈ ప్రశంసాప త్రాన్ని అప్పటి రాష్ట్ర మంత్రి వర్యులు రాంరెడ్డి వెంకటరెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు.

## మేడారం జాతరకు పన్నెండుసార్లు నియామకం..

భద్రాచలంలో శ్రీరామనవమి కి దాదాపు 29 సార్లు వైద్య శిబిరం నిర్వహణ- రెండు గోదావరి పుష్కరాలకు భద్రాచలంలో వైద్య శిబిరం నిర్వహణతో తన సేవలను అందించారు. డాక్టర్ గిరిసింహారావు వైద్యసేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం మేడారం మహా జాతరలో ఆర్టీసీ వైద్యఅధికారిగా ప్రతి జాతరలోనూ నియమిస్తోంది. ప్రతిసారి ఆర్టీసీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేస్తారు. శిబిరానికి ఇన్చార్జిగా విధులు నిర్వర్తిస్తున్నారు.ఇప్పటి వరకు ఆయన పన్నెండు సార్లు వైద్య అధికారిగా నియమితులయ్యారు. తాజాగా 2024 లో ప్రారంభం కానున్న మేడారం మహాజాతరకు ఆయన మరలా వైద్య అధికారిగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధంగా ఉన్నారు.

## రచనలతో సమాజాన్ని తట్టిలేపుతూ..

ఒక వైపు విధి నిర్వహణ, మరో వైపు సామాజిక సేవల్లో పాల్గొంటూనే సాహిత్యంపై ఉన్న మక్కువతో రచనలు చేస్తున్నారు.పలు కవితలు, పాటల ద్వారా సమాజ చైతన్యం తెస్తున్నారు. గిరిసింహారావు కలం



నుంచి ఎన్నో కవితలు జాలువారాయి. అందులో కొన్ని ప్రజలను ఆలోచింపజేసే విధంగా ఉంటాయి. అందులో కాలం విలువను తెలిపే కాలం.. కాలం.. ఖరీదు అనే కవిత్వం సందేశాత్మకంగా ఉంటుంది. నువు పుట్టిన మట్టి నీది కాదు. నువు పెంచిన చెట్టు నీది కాదు, నీ పూరు నీది కాదు... నీ రూపమే నీదికాదు అంటూ ఏదీ శాశ్వతం కాదనే సందే శాత్మకమైన కవిత ఆకట్టుకుంటుంది. తెలంగాణ ఉద్యమ సమయంలో సైతం తనవంతు పాత్రగా రచనలు చేస్తూ కవితలు రాస్తూ, తెలంగాణ ఆవిర్భావం ఎంత ముఖ్యమో తెలిపే విధంగా పాటలు రాశారు.వన దేవతలు పేరుతో సమ్మక్క,సారలమ్మల పోరాటాన్ని కవిత్వీకరించారు.తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల సంర్భంగా 'తెలంగాణ బాషంటే బాంచెన్ కాల్మొక్త'మాత్రమే కాదు 'గొంతుకలో చేరిన గుండెలయప్రాస... శ్రమజీవుల నాలుకలపై చెమట చినుకుల ఘోష' అంటూ తెలంగాణ మట్టి పౌరుషాన్ని తట్టి లేపారు.ఈ విధంగా ఆయన కలం నుంచి ఎన్నో కవిత్వాలు మనసును, సమాజాన్ని,ప్రజలను తట్టి లేపే విధంగా ఉన్నాయి.